

## జగిత్యాల్ పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

ఈ సందర్భంగా పురానిపేట లోని శ్రీ ఆంజనేయ దేవాలయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం,కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం ఆలయంలో భజన మండలి సభ్యలను ఆయన సన్మానించారు.,

## రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో బంగారు పథకాలు సాధించినా విద్యార్థులను అభినందించిన డి.ఎస్.పి



ఆదివారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపెట్ టౌన్ లో జరిగిన 4వ రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ 2024 పోటీలలో జె .కె.ఎ. ఇండియా షోటోకాన్ కరాటే అసోసియేషన్ జగిత్యాల జిల్లా వివిధ కరాటే బ్రాంచ్ లు ఇబ్రహీంపట్నం,మెట్ పల్లి,బండా లింగాపుర్ కరాటే బ్రాంచ్లలో నుండి 13 మంది కరాటే విధ్యార్థులు పాల్గొన్నారు. వారిలో మొత్తం 13 మంది విద్యార్థులు బంగారు పథకాలు సాధించారు. వీరిలో బండాలింగపుర్ కు చెందినా విద్యార్థులు అత్యధిక బంగారు పథకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్షిప్ కప్ కైవసం చేసుకున్నారు. ఈ సంధర్భంగా మెట్ పల్లి డి.ఎస్.పి కార్యాలయంలో డి.ఎస్.పి రాములు విద్యార్థులకు గెలుపొందిన ప్రశంసా పత్రాలు, పథకాలు అందజేసి,అభినందించి సత్కరించారు. అనంతరం జిల్లా కరాటే అసోసియేషన్ అధ్వర్యంలో జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు ప్రవీణ్ కుమార్,మాస్టర్ నవీన్,సురేందర్ లు డి.ఎస్.పి రాములు ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు మాస్టర్ ప్రవీణ్ కుమార్, సురేందర్, ఆల్రౌండర్ గంగాధర్, వెంకటేశ్, కరాటే శిక్షకులు వంశీ నాయుడు, నవీన్, పవన్ కల్యాణ్ మాస్టర్లు, ద్యావతి నారాయణ కరాటే విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులకు సన్మానం కళాశాల యజమాన్యం

జగిత్యాల జిల్లా మెట్పల్లి జ్ఞానోదయ డిగ్రీ హ్యాండ్ పీజీ కళాశాలలో నలుగురు పూర్వ విద్యార్థులు కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న బి అరుణ్ కుమార్ కథలాపూర్.వి గణేష్ జగిత్యాల హెడ్ క్వార్టర్స్.పి రాజ్ కిరణ్ కోరుట్ల.ఎల్ రాహుల్ కోరుట్ల పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గా ఎన్నికైనా నలుగురుని కళాశాల కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ ఘనంగా సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ......మా కాలేజీలో చదివి కానిస్టేబుల్ గా ఎన్నికైన వీరిని కాలేజ్ తరఫున అభినందిస్తున్నట్టు అలాగే విధుల్లో మరింత పదోన్నతులు పొంది ఉన్నతమైన స్థానం పొందాలని ఆకాంక్షిస్తున్నట్టు అన్నారు. ఈ కార్యక్రమం లో కరెస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్,ప్రిన్సిపాల్ సంతోష్,వైస్ ప్రిన్సిపాల్ రాజు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు జిల్లా ప్రజలందరూ సహకరించాలి

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు జిల్లా ప్రజలందరూ సహకరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు కోరారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జిల్లా ప్రజలందరూ పాల్గొని సరియైన సమాచారం అందించి అధికారులకు సహకరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఒక ప్రకటనలో కోరారు. ప్రజా పాలన లో వచ్చిన దరఖాస్తు లలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు పథకానికి ఎవరైతే దరఖాస్తు చేసుకున్నారో వారి వివరాల సేకరణను మొబైల్ యాప్ లో పొందుపరచడానికి ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందని,జియో టాకింగ్ ద్వారా ఫోటో తీసుకోబడుతుందనీ తెలిపారు.గతంలో ఇండ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకు వచ్చే సిబ్బందికి ఇంటి స్థల ధ్రువీకరణ పత్రాలను, లబ్ధిదారుల ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ వివరాలు,ఖచ్చితమైన సమాచారం అందించాల్సిందిగా కలెక్టర్ నేడు ఒక ప్రకటన లో కోరారు. ఏమి అయినా సందేహాలు వుంటే గ్రామ పంచాయతీ కార్యదర్శులను, ఎం పి డి ఓ లను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని లేదా జిల్లా కలెక్టరేట్ లోనీ కంట్రోల్ రూమ్ నెంబర్ 08685293312 ను సంప్రదించ వచ్చని కలెక్టర్ కోరారు.

# ఉద్యమంలా యాదవుల సభ్యత్వ నమోదు నిర్వహించాలి

## యాదవ సంఘం అడహాక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్..




జగిత్యాల జిల్లాలో అన్ని గ్రామాలలో ఉద్యమంలాగా యాదవ సంఘ అడహాక్ కమిటీ సభ్యత్వాలు నిర్వహించాలని యాదవ సంఘం అడహాక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ జిల్లా ముఖ్య సలహాదారుడు కొలుముల రమణ యాదవ్ అన్నారు. యాదవ సంఘం అడహాక్ కమిటీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించి పలు తీర్మాణాలు చేశారు. జగిత్యాల జిల్లాలోని యాదవ సంఘ సభ్యులందరు సభ్యత్వ నమోదు చేసుకునేలా యాదవులని చైతన్య పరచాలని,200 రూపాయల సభ్యత్వ నమోదు ద్వారా జమ అయ్యే డబ్బులను సభ్యుల నిర్ణయం తీసుకుని యాదవ సంఘ సంక్షేమం కోసం ఉపయోగిస్తామని అన్నారు..

యాదవ సంఘం అడహాక్ కమిటీ యొక్క ముఖ్య ఉద్దేశ్యం యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడిని, మండల అధ్యక్షుడిని ఓటింగ్ విధానం ద్వార ఎన్నుకోవాలని అందులో భాగంగా జిల్లాలోని 18 మండలాలలోని అన్ని గ్రామాల యాదవులు 5 మున్సిపాలిటీలోని యాదవ కుల సభ్యులు అందరూ పాల్గొని ప్రతి ఒక్కరు ఓటు వేసేటట్లు చేసి అలాగే సభ్యత్వం ద్వార ప్రతి ఒక్కరికి పోటీ చేసే అవకాశం రావాలని,ఓటింగ్ ద్వార ఎన్నికైన నాయకుడు యాదవులందరికి తెలుస్తాడు.. కాబట్టి యాదవుల సమస్యలు జిల్లా కమిటీకి తెలిపి పరిస్కారం చేసుకోవడానికి ఉపయోగ పడుతుందన్నారు. లాబీయింగ్ చేసి పదవులు తెచ్చుకున్న వారు యాదవులందరికి తెలియరని వారిని జిల్లా యాదవ సంఘ సభ్యులు నమ్మే ప్రసక్తే లేదని అన్నారు..

ఎక్కడినుండో లెటర్లు తెచ్చుకుని ఏండ్లకేండ్లు జిల్లా అధ్యక్షులమని చెప్పుకునే వారు కావాలో.. ఒక యాదవుడిగా మీ ఓటు ద్వార ఎన్నికయ్యే నాయకులు కావాలో.. దయచేసి జిల్లా యాదవ సభ్యులు, కుల పెద్దలు, కుల విద్యావంతులు, మేధావులు ఆలోచించాలని కోరారు.. యాదవ సంఘం జగిత్యాల జిల్లా పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేపించడం జరిగింది.. కావున దీనిని యాదవులందరు గమనించి ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకోవాలని యాదవుల అభివృద్ధి సంక్షేమం, సంఘ బలోపేతం కోసం ముందుకు సాగుదామని కోరారు.. ఇట్టి యాదవ సంఘం అడహాక్ కమిటీకి జిల్లాలోని ఏ ఇతర యాదవ సంఘాలతో సంబంధం లేదని తెలిపారు..అనంతరం సభ్యత్వాలు తీసుకున్న వారికి సభ్యత్వ నమోదు రసీదులని అందించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అడహాక్ కమిటీ జిల్లా కార్యవర్గ సభ్యులు చిర్రం ప్రకాష్ యాదవ్,తోట్ల చిన్నయ్య యాదవ్,తిప్పనవేని రవి యాదవ్,బైరి మహేష్ యాదవ్,కొమురెల్లి యాదవ్, అసరి మల్లేష్ యాదవ్, కొక్కెర మల్లేష్ యాదవ్,జక్కుల భూమేష్ యాదవ్, చిర్రం మల్లేష్ యాదవ్ మానుక కన్నయ్య యాదవ్,క్రాంతి యాదవ్, బడే అనిల్ యాదవ్, కడ మహేష్ యాదవ్,చేకుట గంగాధర్ యాదవ్,లక్ష్మి నారాయణ యాదవ్, రాజేందర్ యాదవ్,మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

## ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచనలు

### - రెవిన్యూ జిల్లా అదనపు కలెక్టర్ వీరా రెడ్డి



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన అర్జీలను రెవిన్యూ జిల్లా అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్ తో కలసి జిల్లాల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. సోమవారం నాడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 34 ఆర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 22, జిల్లా గ్రామీణ అభివృద్ధి 3, జిల్లా వ్యవసాయ శాఖ 3 ఎంప్లాయిమెంట్ 2 మున్సిపాలిటీ , సర్వే ల్యాండ్ రికార్డ్, బీసీ వెల్ఫేర్, వైద్యశాఖ కు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి,, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## యస్.సి వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమీషన్ ఈ నెల11న జస్టీస్ షమీమ్ అఖ్తర్ విచారణ

### - భువనగిరి యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- యస్.సి వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమీషన్ డిసెంబర్ 11 తేది నాడు విచారణ కమీషన్ డా. జస్టీస్ షమీమ్ అఖ్తర్ షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై వివరణాత్మక అధ్యయనం కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లా (నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి) పరిధిలో బహిరంగ విచారణకు 11-12-2024 నాడు నల్లగొండ జిల్లాకు విచ్చేయుచున్నారు. కావున ఉమ్మడి నల్లగొండ (నల్లగొండ, సూర్యాపేట,యాదాద్రి భువనగిరి) యస్.సి కులాల సంఘ నాయకులు, అధిక సంఖ్యలో బహిరంగ విచారణకు నల్లగొండ కలెక్టరేట్ కార్యాలయము నందు ఈనెల 11న హాజరై తమ తమ వినతులు ఇవ్వాలని షెడ్యూల్డ్ కులాల సంఘ నాయకులను కోరుచున్నాము. ఈ యొక్క విచారణ ఈనెల 11న ఉదయం 11:00 గం.ల నుండి మధ్యాహ్నం 2:00 గం.ల వరకు జస్టీస్ షమీమ్ అఖ్తర్ స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## పెళ్లి కావడం లేదన్న మనస్తాపంతో ఆత్మహత్య



నంగునూరు: పెళ్లి కావడం లేదన్న మనస్తాపంతో ఓ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా రాజగోపాలపేట ఎస్సై ఎండీ ఆసిఫ్ తెలిపిన వివరాలు.. నంగునూరు మండలం సిద్దన్నపేటకు చెందిన సంగు ఆంజనేయులుకు కుమారుడు భాస్కర్ (36), ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భాస్కర్ కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని నెలలుగా వివాహ సంబంధాలు చూసినా కుదరడం లేదు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం కుటుంబీకులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తండ్రి ఆంజనేయులు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

## కార్లు ఢీకొని ఒకరి దుర్మరణం ఐదుగురికి గాయాలు



నర్సాపూర్ రూరల్: ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్న ఘటనతో ఒకరు దుర్మరణం చెందగా, ఐదుగురు గాయపడ్డారు. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం తెలిపిన వివరాలు.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం శాగపూర్‌కు చెందిన శ్రీకాంత్‌కుమార్ (30) ప్రైవేటు కళాశాలను పలువురు మిత్రులతో కొనసాగిస్తున్నాడు. ఆదివారం అతడు తన మిత్రులు యాదగిరి, శివరాములు, రాఘవేంద్ర, శివకృష్ణలతో కలిసి మెదక్ జిల్లాలోని ఏడుపాయల పుణ్యక్షేత్రానికి వచ్చారు. దుర్గమ్మను దర్శించుకొని రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట వద్దకు రాగానే, అదే సమయంలో హైదరాబాద్ నుంచి మెదక్ వైపు వెళ్తున్న మరో కారు డ్రైవరు హుస్సేన్ అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఐదుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికొ చేరుకొని పరిశీలించారు. క్షతగాత్రులను హైదరాబాద్ సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య భారతి, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

## భర్త కళ్లముందే భార్య..

నార్సింగి (చేగుంట): వ్యవసాయ పనులకు వెళుతున్న దంపతులను కారు ఢీకొనడంతో భార్య దుర్మరణం చెందిన ఘటన నార్సింగిలో సోమవారం జరిగింది. ఎస్సై అహ్మద్ మోహీనుద్దీన్ తెలిపిన ప్రకారం నార్సింగికి చెందిన వట్టెపు లక్ష్మి (40), నాగరాజు దంపతులు వ్యవసాయం చేస్తుంటారు. బోరు బావి వద్ద పనులు చేసేందుకు నడుచుకుంటూ పొలానికి బయలుదేరారు. 44వ జాతీయ రహదారి పక్కనుంచి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న కారు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా, నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన శంకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# సమగ్ర శిక్షాలో సమ్మె సైరన్



భూపాలపల్లి : గత 18 ఏళ్లుగా తక్కువ వేతనాలతో సేవలు అందిస్తున్నా.. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ విద్యాశాఖకు చెందిన సమగ్ర శిక్షా సిబ్బంది నేటి నుంచి సమ్మె బాట పట్టనున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న సిబ్బంది విధులకు దూరం కానున్నారు. ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు, ఎంఈవోలకు ఇప్పటికే సిబ్బంది సమ్మె నోటీసులు ఇచ్చారు. మంగళవారం నుంచి విధులకు హాజరుకాలేమని స్పష్టం చేస్తున్నారు. జయశంకర్, ములుగు, వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన మొత్తం 2,514 మంది ఉద్యోగులు సమ్మె బాటకు సిద్ధమయ్యారు. దీంతో విద్యాశాఖకు చెందిన అనేక పనులు కుంటుపడనున్నాయి. విద్యాభివృద్ధిలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో 347 మంది, హనుమకొండలో 398, వరంగల్‌లో 485, జనగామలో 414, ములుగులో 306, మహబూబాబాద్‌లో 568 మంది పనిచేస్తున్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 2004 నుంచి పీజీ సీఆర్టీ, పీఈటీలు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. విద్యాశాఖలో జిల్లా స్థాయిలో ఏపీవోలు, డీపీవోలు, సాంకేతిక నిపుణులు తదితరులు పని చేస్తున్నారు. మండల స్థాయిలో కంప్యూటర్ సహాయకులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలను అందించే భవిత కేంద్రాల్లో ఉపాధ్యాయులు, రీసోర్సు పర్సన్లు, పాఠశాల స్థాయిలో ఆర్ట్, క్రాఫ్ట్, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, ఏఎన్‌ఎంలు, పీఈటీలు, అకౌంటెంట్లు, కంప్యూటర్ సహాయకులు, వంట పనివారు, వాచ్‌మెన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు పనిచేస్తున్నారు. వీరంతా సమ్మెలోకి వెళ్తే విద్యాశాఖపై తీవ్ర ప్రభావం పడుతుంది.

### డిమాండ్లు ఇవీ

సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని, ఇప్పటివరకు పే స్కేల్ కల్పించాలని, ప్రతి ఉద్యోగికి రూ.20 లక్షల జీవిత బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా అమలు చేయాలని, సమగ్ర శిక్షా ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాల కింద రూ.25 లక్షలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.